

కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలి

సిఐటియు నాయకులు రాజు

ప్రజాశక్తి - ముసునూరు

ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలని సిఐటియు నాయకులు జి.రాజు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఓటర్లను ఉద్దేశించి వారితో మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లు, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ విద్యార్థులు, రైతులు, సామాన్య ప్రజల సమస్యలను శాసనమండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా, ఆ సమస్యలను పరిష్కరించే విధంగా ప్రతిపక్ష హోదాలో పోరాడిన వ్యక్తి కెఎస్.లక్ష్మణరావు అని అన్నారు. ఆయనతో పాటు సిఐటియు నాయకులు కొడవలి శ్రీనివాస్, కంచర్ల రమేష్, సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌలు చట్టం.. కథ కంచికేనా..!



కౌలు రైతులను కూటమి సర్కార్ మోసం చేస్తోందా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీని పక్కను పెట్టేసిందా.. కౌలు చట్టంలో మార్పులు చేస్తామంటూ తొలుత హడావుడీ చేసి మౌనం వహించడం వెనుక కారణం అదేనా'.. అంటే అవుననే సమాధానం వస్తోంది. బడ్జెట్ సమావేశాల్లో కొత్త కౌలుచట్టం బిల్లు ప్రవేశ పెట్టి వచ్చే ఖరీఫ్ నుంచి ప్రభుత్వం అమలు చేస్తాందా అన్న చర్చ రైతుల్లో కొనసాగుతోంది. ఫిబ్రవరి చివరి వారంలో బడ్జెట్ సమావేశాలు జరిగే అవకాశం ఉండడంతో కొత్త కౌలు చట్టంపై కౌలు రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కౌలుదారులకు ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందో లేదో చూడాల్సి ఉంది.

- కొత్త చట్టం తెస్తామంటూ ఆదిలో కూటమి సర్కార్ హడావుడీ
- ఆ తర్వాత మౌనం
- ఏలూరు, పశ్చిమ జిల్లాలో దాదాపు 3 లక్షల మంది కౌలు రైతులు
- వైసిపి ప్రభుత్వం చట్టంలో చేసిన మార్పులతో తీవ్ర నష్టం
- కొత్తచట్టం తెచ్చి న్యాయం చేస్తామంటూ కూటమి హామీ
- జిల్లాలో ఏర్పాటు చేసిన ముసాయిదా సమావేశం రెండు సార్లు రద్దు
- బడ్జెట్ సమావేశాల్లో చట్టం తెస్తారా అంటూ రైతుల్లో చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్రంలో అత్యధికంగా కౌలురైతులు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోనే ఉన్నారు. దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉండగా, జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ లెక్కలు సైతం ఇదే విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. అందరికీ అన్నంపెట్టే కౌలురైతులకు మాత్రం ప్రభుత్వాలు న్యాయం చేయడం లేదు. సాగు చేస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వ సాయం అందకుండా చేస్తున్న పరిస్థితి నెలకొంది. అందుకు కారణం కౌలుచట్టంలో ఉన్న లొసుగులే కారణమని చెప్పొచ్చు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ అధీకృత సాగుదారుని' చట్టం పేరుతో కౌలురైతులకు ప్రత్యేక చట్టం తెచ్చింది. ఈ చట్టం కౌలురైతులకు కొంతమేర ఉపయోగపడినా పూర్తిస్థాయిలో న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. ఈ చట్టంలో భూ యజమానితో సంబంధం లేకుండా కౌలురైతులకు కౌలుకార్డులు జారీ చేసేవిధంగా నిబంధనలు తెచ్చారు. దీంతో కౌలుకార్డులు ఇవ్వకపోతే కౌలురైతులు, రైతుసంఘాల నాయకులు రెవెన్యూ అధికారులను నిలదీసేవారు. దీంతో కౌలుకార్డులు సాగుదారులకు అందేందుకు కొంత దోహదపడింది. కౌలుకార్డులు అందుకున్న రైతులకు పంటరుణాలు ఇవ్వాలంటూ బ్యాంకుల వద్ద ఆందోళన చేసి కొంతమేర సాధించుకునేవారు. కౌలురైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే విధంగా కౌలుచట్టంలో మార్పులు చేయాలని కౌలురైతులు, రైతు సంఘాల నుంచి పెద్దఎత్తున డిమాండ్ ఉండేది.

వైసిపి చేసిన చట్టంతో కౌలురైతుల మెడకు ఉరి..

2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కౌలుచట్టంలో మార్పులు చేస్తున్నట్లు చెప్పింది. దీంతో కౌలురైతులకు న్యాయం జరుగుతుందని అంతా భావించారు. వైసిపి 2019లో చేసిన 'ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుని హక్కుచట్టం' కౌలురైతులకు ఉరితాడుగా మారింది. భూయజమాని అంగీకారంతోనే కౌలురైతులకు కౌలుకార్డులు ఇవ్వాలంటూ కొత్తచట్టంలో మార్పులు చేసింది. దీంతో కౌలురైతులకు కౌలుకార్డులు అందని ద్రాక్షగా మారాయి. దీంతో అధికారులు కౌలురైతుల సంఖ్యను తక్కువగా చూపిస్తూ ఏమార్చేందుకు ప్రయత్నాలు చేయడం ప్రారంభించారు. ఈ చట్టంతో కౌలుకార్డులు అందకపోవడం, బీమా, పంట నష్టపరిహారం వంటి ఏ ఒక్క ప్రభుత్వ సాయమూ కౌలురైతులకు అందకుండా పోయింది. చివరకి తాను పండించిన పంటను సైతం కౌలురైతులు తన పేరున అమ్ముకునేందుకు వీల్లేకుండా వైసిపి చేసిన చట్టం తయారైంది. దీంతో కష్టాల ఊబిలో కూరుకుపోవడంతో కౌలురైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి.

కొత్త కౌలుచట్టంపై తొలుత హడావుడీ..తర్వాత మౌనం

తాము అధికారంలోకి వస్తే కొత్త కౌలుచట్టం తీసుకొచ్చి కౌలురైతులకు న్యాయం చేస్తామని టిడిపి కూటమి చెప్పింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలుచట్టం ముసాయిదా తయారు చేసేందుకు అభిప్రాయ సేకరణ పేరుతో జిల్లాల వారీగా కొన్నిచోట్ల సమావేశాలు నిర్వహించింది. శీతాకాల సమావేశాల్లో కొత్త కౌలుచట్టం చేస్తామంటూ హడావుడీ చేసింది. జిల్లాలో సమావేశం ఏర్పాటుకు సంబంధించి రెండు సార్లు తేదీలు ప్రకటించి రద్దు చేసింది. ఆ తర్వాత కౌలుచట్టం ఊసే లేకుండా పోయింది. శీతాకాల సమావేశాలు ముగిసిపోయాయి. ఫిబ్రవరి చివరి వారంలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం చూస్తోంది. బడ్జెట్ సమావేశాల్లో కొత్త కౌలుచట్టం తెస్తారా లేక రైతులను మోసం చేస్తారా తేలిపోనుంది. భూ యజమానుల ఒత్తిడి మేరకు కొత్త కౌలుచట్టంపై ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త కౌలుచట్టం చేసి వచ్చే ఖరీఫ్ నుంచి కౌలురైతులకు ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అందేవిధంగా చేస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. కొత్త కౌలుచట్టం చేస్తే లబ్ధిపొందే వారిలో జిల్లాలోని రైతులే ఎక్కువగా ఉంటారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎంఎల్‌ఎలు సైతం కౌలుచట్టం గురించి మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందో లేదో చూడాల్సి ఉంది.



నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎంపీ హర్షకుమార్ కుమారుడు జివి.సుందర్

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు 18 నామినేషన్లు

మొత్తం 20 మంది అభ్యర్థులు 24 సెట్లు నామినేషన్లు దాఖలు

నేడు, రేపు సెలవు దినాలు

పదో తేదీ ఒక్కరోజే గడువు

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం 18 నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు కలెక్టరేట్లో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి నామినేషన్లు స్వీకరించారు. టిడిపి అభ్యర్థిగా బరిలో దిగిన పేరాబత్తుల రాజశేఖరం తరపున కాకినాడకు చెందిన ఎస్‌వి.విశ్వనాథం నామినేషన్ దాఖలు చేశారు. పెద్దాపురానికి చెందిన వానపల్లి శివ గంగ వీరగణేష్, బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన బండారు రామ్మోహన్ రావు, దొడ్డిపట్ల పెదలంకకు చెందిన నేతిపూడి సత్యనారాయణ నామినేషన్లు దాఖలు చేశారు. ఏలూరుకు చెందిన పచ్చిగొల్ల దుర్గారావు, భీమవరం కు చెందిన బొమ్మిడి సన్నిరాజ్, రాజమండ్రికి చెందిన జివి.సుందర్, రామచంద్రపురానికి చెందిన కుక్కల గోవిందరాజు, బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన కాండ్రేగుల నరసింహులు, జగ్గంపేటకు చెందిన గద్దే విజయలక్ష్మి, నర్సాపురానికి చెందిన కట్టా వేణుగోపాలకృష్ణ, బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మాకే ప్రసాద్, పోలవరానికి చెందిన చిక్కాల దుర్గారావు, నిడదవోలుకు చెందిన తాళ్లూరి రమేష్, ఏలూరుకు చెందిన చిక్కా భీమేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేయగా, ఇప్పటికే నామినేషన్ దాఖలు చేసిన కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ములగల శ్రీనివాసరావు మరోసెట్టు నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ పత్రాలు సమర్పించిన అభ్యర్థులతో జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి ప్రమాణం చేయించారు. దీంతో నామినేషన్ల స్వీకరణ మూడో తేదీ నుంచి ఇప్పటివరకూ మొత్తం 20 మంది అభ్యర్థులు 24 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, తదితరులు ఉన్నారు. టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం పదో తేదీన అట్టహాసంగా నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న పరిస్థితి ఉంది.

నామినషన్లకు ఇక ఒక్కరోజే గడువు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి నామినేషన్ల గడువు ఇంకా ఒక్కరోజు మిగిలింది. ఈ నెల మూడో తేదీ నుంచి పదో తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియకు షెడ్యూల్ విడుదలైంది. ఇప్పటివరకూ 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో నామినేషన్ దాఖలకు వీలులేదు. దీంతో చివరితేదీ పదో తేదీ ఒక్కరోజు మిగిలింది. ఆఖరు రోజు ఎన్ని నామినేషన్లు దాఖలవుతాయో చూడాల్సి ఉంది.

పత్తి, మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి - రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


అన్ని రకాల ఒడిదుడుకులను ఎదుర్కొని పత్తి, మిర్చి పండించిన రైతులకు కనీస ధర రాక నష్టపోతున్నారని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి కొనుగోలుకు సిసిఐ కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. క్వింటాల్ పత్తికి రూ.10 వేలు, క్వింటాల్ మిర్చికి రూ.25 వేల కనీస ధర అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జంగారెడ్డిగూడెంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డు రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పత్తి, మిర్చి వ్యాపారులు ధరలు తగ్గించి రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారన్నారు. గత సంవత్సరం క్వింటాల్ రూ.12 వేలు పలికిన పత్తి ధర ఈ సంవత్సరం పత్తి దిగుబడులు తగ్గిపోవడమే కాకుండా ధర కూడా రూ.5,600 నుంచి రూ.6,300లకే కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ఒకవైపు పత్తి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు, వ్యవసాయ ఉపకరణాల ధరలు, వ్యవసాయ కూలీలకు ధరలు అన్నీ పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 2024 ఖరీఫ్ సీజన్‌లో క్వింటాలు పత్తికి రూ.7,521 మద్దతు ధరగా ప్రకటించిందని, కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కూడా అమలు చేయని వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పత్తి కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సిసిఐ తక్షణం పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, క్వింటాల్ పత్తికి కనీస మద్దతు ధర 10 వేలు పత్తిని కొనుగోలు చేయాలని, పత్తి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మిర్చి క్వింటాల్‌కు రూ.25 వేల కనీస ధర అమలు జరిగేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, మండల అధ్యక్షులు బోడిక రామచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

వెట్టిచాకిరీ నిర్మూలనకు కృషి చేయాలి

జెసి ధాత్రిరెడ్డి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

బాల బాలికలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని వారు తప్పనిసరిగా చదువుకునే విధంగా చట్టాలు ఉన్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. శుక్రవారం వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనా దినోత్సవం సందర్భంగా వెట్టి చాకిరీ వ్యవస్థపై వాల్‌పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా జెసి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా రూపు మాపేందుకు సంబంధిత అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. సమాజంలో వెట్టిచాకిరీ కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎ.శ్రీనివాస్, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, సిడబ్ల్యూసి ఛైర్మన్ పి.వెంకటేశ్వరరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, మహిళా పోలీస్ ఎస్ఐ వి.కాంతిప్రియ, ఐసిడిఎస్ పీడీ పి.శారద, డిసిపిఒ సూర్యచక్రవేణి, పలువురు కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏలూరు: జిల్లాలో వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, వెట్టి చాకిరీ చేసే వారిని గుర్తించి వారిని అక్కడ నుంచి విడిపించాలని, వారికి భద్రత కల్పించి వారి స్వస్థలాలకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వెట్టిచాకిరీ నిర్మూలనా వ్యవస్థలపై గ్రామ మహిళా సంరక్షణా కార్యదర్శులకు, ఇతర ప్రభుత్వ శాఖల వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా రూపు మాపాలని తెలిపారు. ఏలూరు జోన్ సంయుక్త కార్మిక కమిషనర్ ఎ.రాణి, ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ మాట్లాడారు.

కొల్లేరు రైతులకు న్యాయం చేయండి

కేంద్ర మంత్రికి ఏలూరు ఎంపీ వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కొల్లేరు అభయారణ్య ప్రాంతం నుంచి 14,861 ఎకరాల ప్రయివేట్ భూములు, 7102 ఎకరాల అసైన్డ్ భూములకు సరిహద్దు పునరుద్ధరించాలని సిఫార్సు చేస్తూ నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ మంజూరు చేసిన వెసులుబాటును అమలు చేసే వీలు కల్పించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కేంద్ర పర్యావరణ శాఖ, అటవీ, వాతావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కొల్లేరు ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఢిల్లీలోని ఇందిరా పర్యావరణ భవన్‌లో కేంద్ర మంత్రిని ఎంపీ మహేష్‌కుమార్ శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. 2025 జనవరి 16న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో కొల్లేరు సరస్సు ప్రాంతంలో దీర్ఘకాలికంగా నివసిస్తున్న ప్రజలు భయాందోళనకు గురవుతున్న విషయాన్ని పుట్టా మహేష్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు జారీ చేసిన ఆదేశాలతో 122 గ్రామాల్లోని రైతులు, ప్రజలు జీవనోపాధిని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని, తరతరాలుగా అక్కడ భూమిపై ఆధారపడిన మూడు లక్షల మందికిపైగా ప్రజల మనుగడను ప్రమాదంలో పడేసిందని ఎంపీ మహేష్ కేంద్ర మంత్రికి వివరించారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని పరిగణలోకి తీసుకోకుండా సుప్రీంకోర్టు ఆదేశాలను అధికారులు అమలు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్‌బిడబ్ల్యూఎల్ మంజూరు చేసిన వెసులుబాటులో పొందుపరిచిన చిత్తడి నేల రూల్స్ 2017, వన్యప్రాణుల రక్షణ చట్టం, 1972 ప్రకారం సరైన సరిహద్దులను నిర్ధారిస్తూ, సుప్రీంకోర్టుకు సవరించిన అఫిడవిట్‌ను ఫైల్ చేయమని సంబంధిత అధికారులకు ఆదేశించాలని కోరారు. భూముల వాస్తవ స్థితి, బాధిత ప్రజలు న్యాయమైన క్లెయిమ్‌ను పరిగణలోకి తీసుకోవడానికి సుప్రీంకోర్టుకు సవరించిన సమర్పణను దాఖలు చేయడానికి వీలుగా ఫిబ్రవరి నెలాఖరు వరకు కొల్లేరు ధ్వంసం ప్రక్రియపై స్టే కోరాలని తెలిపారు. ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్న మూడు లక్షల మందికి పైగా ప్రజలు వలసబాట పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం వేదానంద నిర్ణయం సమర్ధవంతంగా అమలు చేసేలా సహకరిస్తూ కొల్లేరు ప్రాంత ప్రజలకు తగిన న్యాయం చేయాలని మహేష్ కుమార్ కేంద్రమంత్రిని అభ్యర్థించారు. కొల్లేరు ప్రాంత ప్రజల తరఫున తాను చేసిన విజ్ఞప్తికి కేంద్రమంత్రి స్పందించాలని ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు.



కేంద్రమంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ మహేష్‌కుమార్

లారీ డ్రైవర్ల జీవనోపాధిని కాపాడాలి

సిఐటియు ఆధ్వర్యాన లారీ యూనియన్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కుక్కునూరు

స్థానిక లారీలతో మండలంలోని పత్తి, మిరప తదితర రవాణా సర్వీసులు చేయాలని సిఐటియు కుక్కునూరు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. లారీ డ్రైవర్ల జీవనోపాధిని కాపాడాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో లారీ యూనియన్ కార్మికులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సరుకు రవాణా కోసం నిరంతరం అహర్నిశలు, ప్రాణాలు సైతం లెక్క చేయకుండా, ప్రభుత్వానికి, ప్రయివేట్ సంస్థలకు ఆదాయం చేకూర్చే లారీ డ్రైవర్లు కుటుంబ పోషణ గడవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుక్కునూరు మండలంలో కొంత మంది ఫెర్టిలైజేర్స్ యజమానులు బయట లారీలను తీసుకొచ్చి రవాణా చేయిస్తున్నారన్నారు. ఇలా ఎందుకు చేయిస్తున్నారని ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు పెడుతున్నారన్నారు. ఇలా చేయడం వల్ల స్థానికంగా ఉన్న లారీ డ్రైవర్లకు జీవనోపాధి లేక కుటుంబ పోషణ గడవక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అసలే కుక్కునూరు ముంపు ప్రాంతం కావడం పనుల్లేక ఇబ్బందులు పడుతున్న సందర్భంలో ఇప్పుడు ఉన్న ఉపాధి కూడా దెబ్బతింటుంటే ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో లారీ డ్రైవర్లు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని కుక్కునూరు మండల వ్యాప్తంగా ఎక్కడ రవాణా జరిగిన స్థానికంగా ఉన్న లారీలతో పనులు చేసేలాగా చర్యలు తీసుకుని, లారీ డ్రైవర్ల ఉపాధిని కాపాడాలని సాయికిరణ్ కోరారు. ఈ కార్యక్రమంలో లారీ యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శి మహమ్మద్ వలిపాషా, నిర్మల వెంకటేశ్వర్లు, అంగిరేకుల వెంకటేశ్వరరావు, కట్టెబోయిన మల్లేష్, వెంకటేశ్వరరావు, ఓగిరాల నాగరాజు, కె.మహేష్ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు


దళితుల శ్మశాన భూమికి రక్షణ కల్పించాలి

జిఒ 1235ను అమలు చేయాలి

వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యాన ముండూరులో పర్యటన

ప్రజాశక్తి - దెందులూరు

ముండూరు దళితవాడ శ్మశాన భూమికి రక్షణ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో పెదవేగి మండలం ముండూరు గ్రామంలో అక్రమణకు గురైన దళితుల స్మశాన భూమిని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలు, దళితులకు చెందిన శ్మశాన భూముల రక్షణ కోసం 2005 సంవత్సరంలోనే అప్పటి ప్రభుత్వం జిఒ 1235 తీసుకొచ్చిందన్నారు. ఈ జిఒను అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. దళితులకు సాగు భూమి లేకుండా ఓ పక్కన ఇబ్బందులు పడుతుంటే చనిపోయిన తర్వాత కూడా ఖననం చేసుకోవటానికి ఉన్న భూమిని కూడా ఆక్రమణ చేయటం సిగ్గు చేటన్నారు. దళితుల భూములకు రక్షణ కల్పిస్తూనే శ్మశాన భూములకు కూడా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. దళితుల శ్మశాన భూమి ఆక్రమించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడులు చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వాటిని నివారించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ముండూరు గ్రామంలో దళితుల శ్మశానభూమిని వెంటనే సర్వే చేయాలని కోరారు. శ్మశాన భూములకు హద్దులు కల్పించాలని, వాటికి తక్షణమే రక్షణ కల్పించాలని కోరారు. లేకపోతే రానున్నకాలంలో పేదలందరినీ, దళితులను ఏకం చేసి ఆందోళన పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బట్టు మోషే, కొరపాటి విజయ్, గడ్డం గంగరాజు, జాలాది శ్రీను, గడ్డం రాజారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు రామకృష్ణ, శ్రీనివాస్

సిబ్బంది సంక్షేమానికి కృషి

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సిబ్బంది సంక్షేమానికి కృషి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు సంక్షేమ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం ఎస్‌పి సారథ్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి పాల్గొని సిబ్బంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. సిబ్బంది సమస్యలను తెలియజేసేందుకు నేరుగా తనను కలవవచ్చని చెప్పారు. ఒకవేళ సమస్యలు పరిష్కారం కాకుంటే తనకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఎఒ సాల్మన్‌రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిగ్నస్ 25 అధికారిక వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో ఈ ఏడాది నిర్వహించనున్న వార్షిక సాంస్కృతిక మహోత్సవం సిగ్నస్ 25 అధికారిక వెబ్‌సైట్ https://www.cygnusrguktn.org శుక్రవారం ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని సూచించారు. మన దేశ సంస్కృతిని, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూజివీడు క్యాంపస్ పరిపాలన అధికారి డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ సిగ్నస్ 25 కేవలం వినోదానికి మాత్రమే కాకుండా విద్యార్థుల్లో నైపుణ్యాలు, నాయకత్వ గుణాలను అభివృద్ధి చేసే ఒక వేదికని అన్నారు.

ఏరియా ఆసుపత్రిలో అత్యాధునిక డెంటల్ ఎక్స్‌రే

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రిలో అత్యాధునిక డెంటల్ ఎక్స్‌రే మిషన్ ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ మాట్లాడుతూ మంత్రి పార్థసారధి ఆదేశంతో డెంటల్ ఆర్‌విజి ఎక్స్‌రే యూనిట్ రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. దీని ద్వారా అనేక దంత సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రెడ్డి అప్పలనాయుడును కోరిన ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని కొత్త బస్టాండ్ పరిధిలో ఉన్న ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు శుక్రవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో విజయవాడ ఆర్‌టిసి జోనల్ చైర్మన్, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడును కలిశారు. వారికి ఉన్న పలు సమస్యలు పరిష్కరించాలని రెడ్డి అప్పలనాయుడుని యూనియన్ నాయకులు కోరారు. వెంటనే స్పందించిన జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ఆర్‌టిసి అధికారులతో యూనియన్ వారికి ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారికి ఏమైనటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ఆ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఆయన కార్మికులకు సూచించారు. జోనల్ చైర్మన్ రెడ్డిఅప్పలనాయుడు స్పందించిన తీరు పట్ల యూనియన్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

33/11 కెవి ముదినేపల్లి సబ్ స్టేషన్, మండలంలోని పెదపాలపర్రు సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఉదయం పది గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ బి.పూర్ణచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులకు ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలందరు సహకరించాలని కోరారు.

ఘనంగా ఇ-క్రష్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో ఇ-క్రష్ విభాగం తొమ్మిదో వార్షికోత్సవ వేడుకలు ఆంగ్ల విభాగ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఉన్నతాధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ఆంగ్ల విభాగాధిపతి మరియరాణి మాట్లాడుతూ ఆంగ్ల భాష నేటి ప్రపంచంలో విద్య, ఉపాధి అవకాశాలకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు కీలక భాష అని వివరించారు. ఇ-క్రష్ కన్వీనర్ కాత్యాయని మాట్లాడుతూ ఈ విభాగం కేవలం భాషాభివృద్ధి మాత్రమే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, లీడర్‌షిప్, నైపుణ్యం పెంపొందించేందుకు పనిచేస్తున్నదన్నారు. ఆంగ్ల అధ్యాపకులు ప్రతాప్ మాట్లాడుతూ తన ఆంగ్ల భాష నేర్చుకునే అనుభవాలను, ఆంగ్ల భాష ద్వారా జరిగే ఉపయోగాలను విద్యార్థులతో పంచుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కళల విభాగం వారు ప్రదర్శించిన కార్యక్రమాలు, ఎన్‌సిసి కేడెట్ల పిరమిడ్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగు రోజులుగా కెరీర్ కాన్సెప్ట్, మైండ్ మారథన్, యూత్ పార్లమెంట్ తదితర పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను మెమెంటోలతో సత్కరించారు.

ఘనంగా హైస్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెదపాలపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత డిప్యూటీ ఇఒ గన్నమనేని వెంకటేశ్వరరావు ఈ పాఠశాలను దత్తత తీసుకున్నారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురంగారావు ఆధ్వర్యంలో గన్నమనేని వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

నిరుపేద ప్రజలకు ఇళ్ల స్థలాలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలో రాజవరం గ్రామంలో గ్రామ సచివాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించుకోవడానికి కాలనీలు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వ పరిపాలనలో ఇల్లు మంజూరు చేసి, పట్టాలు పంపిణీ చేసి, ఇల్లు నిర్మించడం మరిచిపోయిందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాజవరం గ్రామ శాఖ కార్యదర్శి రేలా నరసింహారావు, వాగు వెంకటరత్నం, నేరుసు బుక్కయ్య, నిమ్మల గంగరాజు, దుర్గయ్య, ఎర్రావుల గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

'ఎంసి చైర్మన్‌గా బాబీకి అవకాశం ఇవ్వండి'

ప్రజాశక్తి - చాట్రాయి

నూజివీడు నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి ఎస్‌సిలకు కేటాయించారు. చైర్మన్ ముసునూరు మండలంలోని ముసునూరు గ్రామానికి చెందిన కొండేటి బాబి (ఉదయ్)కు అవకాశం ఇవ్వాలని చాట్రాయి మండలం మర్లపాలెం గ్రామానికి చెందిన గ్రామ సర్పంచి, టిడిపి నాయకుడు ముల్లంగి చిట్టిబాబు కోరుతున్నారు. యువకుడు, విద్యావంతుడు అయిన బాబికి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఇస్తే యువతను ఉద్యోగపరంగా, ఆర్థికపరంగా ముందుకు తీసుకెళ్లే సత్తా ఆయనలో ఉందని బాబికి చైర్మన్ పదవి ఇవ్వాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి, నూజివీడు ఎంఎల్‌ఎ పార్థసారధి పరిశీలించి అవకాశం ఇస్తారని ముల్లంగి చిట్టిబాబు ఆవాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

13 నుంచి పీసా కమిటీ శిక్షణ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో పీసా శిక్షణా తరగతులు ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఇ.శ్రీనివాస్ శక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక రోజు మండల స్థాయి పీసా శిక్షణా తరగతుల్లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, మండల ఎంపిటిసిలు సర్పంచులు, పీసా కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు, స్వయం సహాయక సంఘాల లీడర్లకు సచివాలయ సిబ్బందికి మండల స్థాయి అధికారులకు ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ఈ శిక్షణా తరగతులలో పాల్గొనాలని, శిక్షణా తరగతులకు ఆధార్ కార్డు, ఆధార్‌కి లింక్ చేయబడిన ఫోన్ నెంబరుతో హాజరు కావాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అనారోగ్య కారణాలతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు నగరంలోని రెండో పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. ఏలూరు రెండో పట్టణ ఎస్‌ఐ నాగకళ్యాణి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని రెండో పట్టణ పరిధిలో టైటాన్స్ నగర్ ప్రాంతానికి చెందిన దాసరి సురేష్ (29) స్థానికంగా ఓ ప్రయివేట్ ఫైబర్ కంపెనీలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను తలనొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం తలనొప్పి తీవ్రం కావడంతో మనస్తాపానికి గురైన సురేష్ ఇంటి వద్ద ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రెండో పట్టణ ఎస్‌ఐ నాగకళ్యాణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు

ఏలూరులో క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం అమలుకు రూ.2.16 కోట్లతో పనులకు ఆమోదం : జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ క్లీన్ ఎయిర్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు నగరంలో వాయు కాలుష్యం నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. వాయు కాలుష్య నియంత్రణ అమలుపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి దేశంలోని వాయుకాలుష్యం కలిగిన నగరాల్లో కాలుష్య నియంత్రణకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. వాటిలో ఏలూరు నగరం ఒకటన్నారు. ఏలూరు నగరంలో నానాటికీ పెరుగుతూ ప్రజారోగ్యానికి చేటు చేస్తున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏలూరు నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలంలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఏలూరు నగరంలో రహదారుల అంచుల్లో రోడ్ల నిర్మాణం లేని కారణంగా దుమ్ము, ధూళీ కణాల ద్వారా వాయు కాలుష్యం వ్యాపిస్తుందని, దీనిని నివారించడానికి నగరంలోని రోడ్లు మార్జిన్లలో ఎండ్ టూ ఎండ్ వరకు రోడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు రూ.2.16 కోట్లతో పనులు చేపట్టేందుకు సమావేశం ఆమోదించిందన్నారు. ఎలక్ట్రికల్, సిఎన్‌జి వాహనాలను ప్రజలు వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు, కన్సల్టెంట్ ఎ.కోమలి, సామజిక వన విభాగం జిల్లా అటవీ శాఖాధికారి కళ్యాణి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం, రహదారులు భవనాల శాఖ ఇఇ కిషోర్ బాబూజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి ధాత్రిరెడ్డి

చిత్తశుద్ధితో పనిచేస్తేనే ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - దెందులూరు

చిత్త శుద్ధితో పనిచేస్తే ఉద్యోగోన్నతులు అవే వస్తాయని దెందులూరు ఎంపిడిఒ కె.శ్రీదేవి అన్నారు. దెందులూరు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుంకనకరాజు జిల్లా పరిషత్ ఎ గాను, ఆఫీస్ సుబార్డినేట్‌గా పనిచేస్తున్న బి.ముఖేష్ బాదంపూడి ఉన్నత పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతితో బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో వీడ్కోలు సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిడిఒ శ్రీదేవి మాట్లాడుతూ కార్యాలయంలో ఇన్నాళ్లు పనిచేసిన కనకరాజు, ముఖేష్‌లు వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో దెందులూరు, కొవ్వలి, పోతునూరు గ్రామాల కార్యదర్శులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరంలో డ్రైడే

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో బెసా వీధి ఇతర ప్రాంతాల్లో డ్రైడే కార్యక్రమంలో భాగంగా నివాస ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటి తొట్టెలను, ట్యాంకులను ఖాళీ చేయించారు. వీధుల్లో మురికి గుంటల్లో దోమల లార్వా నివారణ కోసం మందులు చల్లారు. ఈ సందర్భంగా స్థానిక గృహిణులకు దోమల వల్ల వచ్చే రోగాలు నివారణ పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగలక్ష్మి, పోశమ్మ, ఆశావర్కర్లు, బీరా రత్నాజీ, గోకా అరుణ పాల్గొన్నారు.

కాపు సంఘం అధ్యక్షుడిగా నందగోపాల్

ప్రజాశక్తి - మండవల్లి

కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా సన్నంశెట్టి నందగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీకృష్ణనాయుడు మండవల్లి మండల కాపు సంఘం అధ్యక్షులుగా పెరిగిగూడేనికి చెందిన నందకిషోర్‌ను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా నందకిషోర్ మాట్లాడుతూ కాపు సంఘం అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా పాటుపడతానన్నారు. కాపు సంఘీయులకు అందుబాటులో ఉంటూ కలుపుకుంటూ ముందుకు సాగుతూ సంఘం అభివృద్ధికి పాటుపడతానన్నారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష పదవిని అందించిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీకృష్ణకు ఇతర నాయకులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన నందకిషోర్‌ను పలువురు నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఆయనను అభినందనలతో సెలవులతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - చాట్రాయి

ఈ నెల పదో తేదీన జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఎంపిపి విజయలక్ష్మి, వైద్యాధికారి ఎ.శ్రీనివాసరెడ్డి, ఎంఇఒ బ్రహ్మచారి తెలిపారు. చాట్రాయి ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 1 నుంచి 19 ఏళ్ల వయస్సు వారందరికీ ఆల్బెండజోలు మాత్రలు తీసుకునేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. పదో తేదీన తీసుకోలేని వారికి 17వ తేదీన ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జివి.రమణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, నాగేశ్వరరావు, సూపరింటెండెంట్, ఆరోగ్య విస్తరణాధికారి పివి.శ్రీధర్, జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ కోరారు. సిపిఐ ఏలూరు ఒకటో డివిజన్ శాఖ కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీఇందిరా ఆధ్వర్యంలో పేదలకు ఇంటి స్థలాలను పెంచి ఇవ్వాలని అర్జీల నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో సెంటు ఇళ్ల స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలం మంజూరు చేసి అట్టహాసంగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి ఇల్లు నిర్మాణం చేయడం మరిచిపోయిందని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో పట్టణ ప్రాంత ప్రజలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంత ప్రజలకు మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నందున దానిపై సమగ్రమైన చర్యలు తీసుకుని పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి నిర్మాణం పూర్తయిన వాటిని మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు తక్షణమే అందించాలన్నారు. ఫిబ్రవరి పదో తేదీన పూర్తి చేసిన అర్జీలను జిల్లా కలెక్టర్‌కు అందించే కార్యక్రమంలో లబ్ధిదారులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి, సమితి సభ్యులు మావూరి విజయ, బళ్ల కనకదుర్గారావు, గొర్లి స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

రైతులమంటూ మోసం!

పంట వేస్తామని సీడ్ కంపెనీకి చెందిన వ్యక్తికి టోకరా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రైతులను సీడ్ కంపెనీలు మోసం చేయడం చూశాం... కాని రైతుల పేరుతో కొంతమంది వ్యక్తులు సీడ్ కంపెనీకి చెందిన వ్యక్తిని మోసం చేసిన ఘటన మండలంలోని తాటియాకులగూడెం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీలుగుమిల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఏజెన్సీ రైతులను ఆసరాగా చేసుకుని ప్రయివేట్ సీడ్ మొక్కజొన్న కెంపెనీదారులు ఒకరి మీద మరొకరు పోటీ పడి ఈ ప్రాంతాల్లో పెట్టుబడులు పెడుతుంటారు. దీనిలో భాగంగా ఓ ప్రయివేట్ సీడ్ మొక్కజొన్న కంపెనీకి చెందిన మధ్యవర్తి ఒకరు ఇక్కడున్న రైతులతో పరిచయాలు పెంచుకుని ఎకరానికి రూ.పది వేల చొప్పున ముందస్తుగా నగదు ఆశ చూపి వారి కంపెనీకి చెందిన సీడ్ మొక్కజొన్న పంటలను వేయిస్తుంటారు. అయితే ఇటీవల కాలంలో దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వ్యక్తులు మూడు నెలల క్రితం గ్రామంలో ఖాళీగా భూములను చూపించి మీ కంపెనీకి చెందిన మొక్కజొన్న పంట వేస్తామని తనను నమ్మించి కొంత మేర డబ్బు తీసుకున్నట్లు మధ్యవర్తి తెలిపాడు. డబ్బు తీసుకొని మూడు నెలలు గడుస్తున్నా చూపించిన భూముల్లో పంటలు వేయకపోగా వేరే చోట ఉన్నాయని, ఆ భూముల్లో వేస్తామని కాలం వెళ్లదీస్తున్నారని మధ్యవర్తి వాపోతున్నాడు. దీనిపై వారిని నిలదీయగా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని లబోదిబోమంటున్నాడు. తోటలు వేయకుండా డబ్బు తీసుకున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు మధ్యవర్తి తెలిపాడు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రహదారిపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని ఎస్‌ఐ పి.నవీన్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. స్థానిక విద్యానిధి పాఠశాల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై, ట్రాఫిక్ రూల్స్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ సిగ్నల్స్ చూసుకుంటూ ప్రయాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎంవి.రత్నం, ప్రిన్సిపల్ ఎం.మంగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ నవీన్‌కుమార్

పునరావాస కాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తాం

ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ



గ్రామస్తులతో ఐటిడిఒ పిఒ, ఆర్‌డిఒ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పునరావాస కాలనీల్లో సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ అన్నారు. పునరావాస కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలపై మండలంలోని కటుకురు, తెల్లవరం, శివగిరి గ్రామాల్లో వారు శుక్రవారం విడివిడిగా క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా పునరవాస గ్రామాల్లో సమస్యలపై నిర్వాసితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ ఇల్లు కేటాయించారని, కాని చినుకు పడితే స్లాబ్‌లు కారుతున్నాయని వాపోయారు. అదేవిధంగా తాగునీటికి బోరులు లేక బయట మోటార్ల దగ్గరకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. అదేవిధంగా కేటాయించిన భూములను ఆన్‌లైన్ చేయకపోవడంతో స్థానిక గిరిజనులతో వివాదాలు పడుతున్నామని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని వాపోయారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. నిర్వాసితులకు కేటాయించిన భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మౌలిక సదుపాయాల సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

పేదలకు వైద్య సేవలు చేరువ చేయడమే లక్ష్యం

ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ తిరివీధి కృష్ణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నేటి సమాజంలో నిరుపేదలైన సామాన్య ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నట్లు తిరివీధి లక్ష్మీరామారావు ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్, యువ న్యాయవాది తిరివీధి కృష్ణ అన్నారు. లక్ష్యాలను సాధించే దిశగా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలు నివసించే ప్రాంతాల్లో ఉచిత మెడికల్ క్యాంపులను తరచూ నిర్వహిస్తున్నట్లు కృష్ణ శుక్రవారం తెలిపారు. అందులో భాగంగానే ఇటీవల నూజివీడు పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన మెడికల్ క్యాంపులను గుర్తించిన వారికి అవసరం మేరకు విజయవాడ నగరంలోని ఎస్‌ఎస్ హాస్పిటల్‌లో పదిమందికి నామినల్ ఛార్జీలతో నేత్ర శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు చెప్పారు. కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సాంకేతిక నైపుణ్యం, హై జెనెటికల్‌గా ఎంతో విజయవంతంగా నేత్ర శస్త్ర చికిత్సలు అనుభవజ్ఞులైన వైద్యులు నిర్వహించినట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి, పేదలకు ఉచిత పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కనీసపు ఛార్జీలతో మాత్రమే ఆపరేషన్లు చేస్తున్నట్లు చెప్పారు. ఉచితంగా కళ్లజోళ్లతో పాటు మందులు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. మెడికల్ క్యాంపులను ప్రచార ఆర్భాటాల కోసం కాకుండా పేదల ఆరోగ్య అభివృద్ధి కోసం మాత్రమే నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఇలాంటి అవకాశాలను సామాన్య ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం పేదల ఆర్థిక స్థితి గమనించి తాము నిర్వహించే క్యాంపులకు అన్నివేళలా సహకరిస్తున్న ఆయా ప్రాంతాల్లోని పెద్దలు, అన్ని తరగతుల ప్రజలు, ముఖ్యంగా ఎస్‌ఎస్ ఆసుపత్రి వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఇండస్ట్రియల్ విజిట్ విజయవంతం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్ కెమికల్ డిపార్ట్‌మెంట్ వారు నిర్వహించిన ఇండస్ట్రియల్ విజిట్‌లో 34 మంది విద్యార్థులు, కెమికల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఒడి ఎం.మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు ఎం.రామకృష్ణ పాల్గొన్నారు. ఈ రెండు రోజుల ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మొదటి రోజు విద్యార్థులు 8.3 ముడి చమురు శుద్ధి చేయగల సామర్థ్యం ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ విశాఖ రిఫైనరీ సందర్శించారు. ఇందులో భాగంగా హెచ్‌పిసిఎల్ యాజమాన్యం ఆ సంస్థ చరిత్ర, సమాజంలో సంస్థ ప్రాధాన్యత, ప్రదర్శన ద్వారా విద్యార్థులకు తెలిపారు. అనంతరం హెచ్‌పిసిఎల్ యాజమాన్యం విద్యార్థులతో ఉద్యోగావకాశాల గురించి, మే నెలలో జరగబోయే సమ్మరిటెన్షిప్స్ గురించి సుదీర్ఘంగా చర్చించారు. రెండో రోజు పరవాడ మండలానికి చెందిన లంకెలపాలెంలో ఉన్న శ్రీకర్ లాబరేటరీస్‌ను సందర్శించారు. అక్కడ కంపెనీ ప్లాంట్ హెడ్ చైతన్యవర్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ యంత్రాల పనితీరును ఎంతో స్పష్టంగా బోధించారు. అనంతరం విద్యార్థుల సమ్మర్ ఇంటర్న్‌షిప్ గురించి కంపెనీ యాజమాన్యంతో డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ చర్చించారు. దానికి కంపెనీ సానుకూలంగా స్పందించింది. విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడే ఈ ఇండస్ట్రియల్ విజిట్‌ను నిర్వహించిన కెమికల్ డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీని ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్, ఎఒ లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ చిరంజీవి, ఇఐటిపి డీన్ శ్యామ్ అభినందించారు. ఈ ఇండస్ట్రియల్ విజిట్‌ల ద్వారా విద్యార్థుల ఉద్యోగ అవకాశాలు అభివృద్ధి చెందవచ్చని ఆర్‌జియుకెటి యాజమాన్యం ఆశిస్తుందని పిఆర్‌ఒ డాక్టర్ రాజేష్ తెలిపారు.



ఇండస్ట్రియల్ విజిట్‌లో విద్యార్థులు

నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని 2022 వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని 18 ఏళ్లు నిండిన యువతకు ఆర్‌అండ్‌ఆర్ కటాఫ్ డేట్‌తో సంబంధం నిర్వాసితులందరికీ వర్తింపజేయాలని కాంగ్రెస్ పోలవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బండి విజయభాస్కర్‌రావు కోరారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ ఆధ్వర్యంలో విజయభాస్కర్‌రావు శుక్రవారం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ మండలాధ్యక్షులు గజ్జి రాజు, మండల ఉపాధ్యక్షులు వడ్డే రఘు, ఎస్‌టి సెల్ అధ్యక్షులు మడకం వీరయ్య, బాణాల వీరాచారి, అంగోసు శ్రీనివాసరావు, మద్దిబోయిన వెంకట్రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనార్టీ సెల్ అజీమ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

24 నుంచి శివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురంలోని శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దివ్య క్షేత్ర ప్రాంగణంలో శివరాత్రి కళ్యాణ మహోత్సవ కరపత్రాలను ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు ఆధ్వర్యంలో తహశీల్దార్ సాయిబాబా, ఎస్‌ఐ జయబాబు, విద్యుత్ అధికారి శ్రీనివాస్‌లు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివ భక్తులు పసుమర్తి రాము మాట్లాడుతూ ఈ ఏడాది శివరాత్రి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి మోదుగు సునంద, పర్వతనేని మురళి, శ్రీనురాజు, దేవరపల్లి ముత్తయ్య, అద్దంకి మహేశ్వరరావు, పేరం రాంబాబు, కాసన్నేని వెంకట్రావు, లింగారెడ్డి శ్రీను, ఘంటా సతీష్, పెద్దిన సత్యనారాయణ, చింతలపూడి నవీన్, వెజ్జు రాజు, మణికంఠ పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి

ప్రజాశక్తి - మండవల్లి

త్యాగానికి, పోరాటానికి నిలువెత్తు నిదర్శనం తల్లి రమాబాయి అని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎల్ఎస్.భాస్కరరావు, గోరింక గాంధీ అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సతీమణి మాత రమాబాయి 128వ జయంతి కార్యక్రమాలను స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ప్రపంచ మేధావిగా ఎదగడానికి రమాబాయి కృషి, తోడ్పాటు ఎంతో ఉందన్నారు. అంబేద్కర్ విదేశాల్లో చదువుకునే రోజుల్లో డబ్బులు పంపించడంతో పాటు అంబేద్కర్ కష్టాల్లో పాలు పంచుకొని ఆయన చదువు కోసం నలుగురు పిల్లలను త్యాగం చేసిన గొప్ప మాతృమూర్తి రమాబాయి అని అన్నారు. కమ్యూనల్ అవార్డుకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ ఎర్రవాడ జైల్లో ఆమరణ దీక్ష పట్టారని గాంధీజీ భార్య కస్తూరిబా సరోజినీనాయుడు మరికొంతమంది మహిళలు రమాబాయి దృష్టికి తీసుకెళ్లగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దగ్గరకు వెళ్లి గాంధీ ప్రాణాలను కాపాడాలని కోరిన దాయత్రి హృదయులు రమాబాయి అని కొనియాడారు. రమాబాయి అంబేద్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా బోధించాలని, ఆమె జయంతిని ప్రత్యేక రోజుగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కొరపాటి శాంతరాజు, కమిటీ సభ్యులు కొండపల్లి రవి వరప్రసాద్, గోరింక గాంధీ, వట్టిప్రోలు సుధీర్, గాలి నాగయ్య, టిఎన్‌ఎస్ విక్టర్ రాజు, నాని, టి.శ్యాంసుందర్, ఆరేపల్లి ప్రదీప్‌కుమార్, విజయ్, గాజులపల్లి వెంకటేశ్వరరావు, బేతపూడి తంబిదాసు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, గూటాల గ్రామం డోర్ నెంబర్ 9-125 కి చెందిన నర్రా సోమరాజు, తండ్రి: నర్రా శ్రీను అను నేను ది. 3-2-2025 వ తేదీన **డాక్యుమెంట్స్ నెం. 81/1998, 269/1994** గల దస్తావేజులను తీసుకొని వెళుతుండగా సుమారు 11 12 గంటల సమయంలో గూటాల నుండి పోలవరం బండి మీద వెళుతుండగా కవర్లో ఉన్న సదరు దస్తావేజులు పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

నర్రా సోమరాజు
తండ్రి: నర్రా శ్రీను
డోర్ నెంబర్ 9-125,
గూటాల, ఏలూరు జిల్లా
సెల్: 89859 92449

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, చాట్రాయి మండలం, కోటపాడు గ్రామానికి చెందిన చీపు రాంబాబు, S/o చెన్నారావు కు సంబంధించిన **సర్వే నెం. 330/B** నకు **దస్తావేజు నెం. 3322/2012** దానికి సంబంధించిన **లింకు దస్తావేజు నెం. 927/2009** మరియు **సర్వే నెం. 288/2** కు సంబంధించిన **దస్తావేజు నెం. 3673/2010** దానికి గల **లింకు దస్తావేజు నెం. 1368/1956** లు గల దస్తావేజులు కోటపాడు గ్రామం నుండి చాట్రాయికి జిరాక్స్‌ల కోసం ది. 5-02-2025 తేదీన ద్విచక్ర వాహనం పై వస్తూ ఉండగా మార్గమధ్యంలో జారి పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

చీపు రాంబాబు
S/o చెన్నారావు
కోటపాడు గ్రామము,
చాట్రాయి మండలం
సెల్: 90008 71607

ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.P.No.17/2023

Between:

నల్లం సురేష్ ...పిటీషనర్

Vs

1: అల్లాడి లక్ష్మి
2: కొమర సుమన
3: కొమర తనూజ దుర్గా గాయత్రి
4: అఫీషియల్ రిసీవర్, ఏలూరు ...రెస్పాండెంట్స్

ప్రకటన

పై నంబరు పిటీషనులో 1వ రెస్పాండెంట్ ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని మరియు ఇతర పరిహారముల నిమిత్తము పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనులో పై రెస్పాండెంట్లుతో ఆస్థులపై లావాదేవీలు జరపరాదని, చెల్లవని ఇందు ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది. సదరు వాయిదా **తేది. 14-02-2025 సం.రం. తేదీన ఉదయం 10-30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పిటీషనులో కోరిన పర్యవసానములు మీ పరోక్షణమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి అనుమతితో)

సిరిపురపు రాజేశ్వర ప్రసాద్
అడ్వకేట్
నరసాపురం, ప.గో.జిలా
సెల్ నెం. 93941 76662

నరసాపురం
ది.05-2-2025